BHARATH SAMACHAR DIGITAL

23, సెప్టెంబర్ 2026, బుధవారం భారత్ సమాచార్

భక్తుల కోలాహలం మధ్య గణపతి నిమజ్జనం



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: సర్వ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు భక్తులచే తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకుని బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. మండల కేంద్రం వెన్నుగొడితితో పాటు వివిధ గ్రామాల్లో సంబంధిత విఘ్నేశ్వర ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ‘గణపతి బప్పా మోరియా’ అంటూ భక్తులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్వామివారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

చిన్ననాగారంలో వైభవంగా శోభాయాత్ర

మండలంలోని చిన్ననాగారం హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన శోభాయాత్రను వైభవోపేతంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

భగవద్భక్తులైన గ్రామ మహిళలు స్వామివారి రథం ముందు భజనలు, కీర్తనలు చేస్తూ భక్తి పారవశ్యంతో ముందుకు సాగారు. భజనలు, నృత్య ప్రదర్శనలతో విఘ్నేశ్వరుడిని అనందింపజేస్తూ మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్న తీరు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది.

భక్తులతో సందడిగా శోభాయాత్ర

ఆలయ కమిటీ సభ్యులతో పాటు యువకులు, మహిళలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో గణపతి శోభాయాత్రలో పాల్గొన్నారు. దారిపొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని మంగళహారతులు సమర్పించారు. పూజా ద్రవ్యాలను తీసుకొచ్చి గణనాథుడికి సమర్పించి భక్తులు పులకించిపోయారు.



గణపతి నిమజ్జన శోభాయాత్రలో భక్తుల నినాదాలు, భజనలు, కీర్తనలు, నృత్య ప్రదర్శనలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొనగా మహిళలు భక్తి పాటలు, భజనలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

పలు గణపతుల నిమజ్జనం

గ్రామంలోని స్టూడెంట్ యూత్, ముత్యాలమ్మ తల్లి యూత్, కొత్తవాడకు చెందిన గణపతులతో పాటు ఎర్రబెల్లి శ్రీనివాసరావు ఆవరణంలోని విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమాలను కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆయా ఆలయ కమిటీల సభ్యులు, యువకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వామివారి శోభాయాత్రల్లో పాల్గొన్నారు. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనాలు

తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో కొలువుదీరిన గణనాథులను భక్తులు కన్నుల పండువగా సాగనంపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణపతి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించి పరిసమాప్తం చేశారు. నిమజ్జనంతో తొమ్మిది రోజుల గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి.

© 2026 Bharath Samachar